
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం
మన అంకుశం
సంచలన సాయంకాలం దినపత్రిక

ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 121 | మంగళవారం 25 ఆగస్టు 2026 | పేజీలు : 4 | వెల : 3/-




# మన కార్యకర్తల కోసం నిలబడాల్సిన ఎన్నికలు



**పార్టీ కార్యకర్తలకు భరోసా కల్పించేలా ప్రతి స్థానంలో పోటీ జరగాలి**

**స్థానిక ఎన్నికలపై వైఎస్ జగన్ కీలక వ్యాఖ్యలు**

**“ఇవి కేవలం గెలుపోటములకు సంబంధించిన ఎన్నికలు కావు**

**ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా జనం ఓటేస్తారు**

**అందుకే చంద్రబాబు ఎన్నికలను నిష్పక్షపాతంగా జరగనివ్వరు**

**స్థానిక ఎన్నికలను నేతలు ఆషామాషీగా తీసుకోవద్దు. బలమైన అభ్యర్థులను నిలబెడదాం.**



**తాడేపల్లి:**
స్థానిక సంస్థల ఎన్నికలపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా గనుక జరిగితే కూటమికి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇస్తారని ఆయన అన్నారు. మంగళవారం వైఎస్సార్సీపీ ముఖ్యనేతలతో భేటీ అయిన వైఎస్ జగన్.. పలు కీలక వ్యాఖ్యలు చేశారు. “ఇవి కేవలం గెలుపోటములకు సంబంధించిన ఎన్నికలు కావు. మన కార్యకర్తల కోసం నిలబడాల్సిన ఎన్నికలు. ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా జనం ఓటేస్తారు. అందుకే చంద్రబాబు ఎన్నికలను నిష్పక్షపాతంగా జరగనివ్వరు - మిగతా 2లో



## ప్రభుత్వం తప్పు చేస్తే.. ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలి?

**హైదరాబాద్**
మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లక్ష్యంగా బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కుత్బుల్లాపూర్‌లో నిర్వహించిన 22ఏ (22ఎ) బాధితుల సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే వివేకానందతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తప్పు చేసింది ప్రభుత్వమైతే, కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలని ప్రశ్నించారు. వందలాది కాలనీల అధ్యక్షులు, వేలాది మంది బాధితులు తమ భూములను నిషేధిత 22ఏ జాబితాలో పెట్టారంటూ ఆవేదనతో ఇక్కడికి వచ్చారని హరీశ్ రావు పేర్కొన్నారు. “భూములను 22ఏలో పెట్టడం - మిగతా 3లో

### కడప శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో

## శాస్త్రోక్తంగా ఉత్తమోత్తమ కలశ స్నపనం

**473 పవిత్ర కలశ జలాలతో స్వామివారికి అభిషేకం**



**అంకుశం న్యూస్ కడప ఆగస్టు 25** దేవుని కడప శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో జరుగుతున్న జీర్ణోద్ధారణ అష్టబంధన మహాసంప్రోక్షణ కార్యక్రమాలు భక్తిభావంతో, ఆగమశాస్త్రోక్తంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఉత్తమోత్తమ కలశ స్నపనం పవిత్ర వేదమంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 473 పవిత్ర కలశాల్లో ఆవాహన చేసిన తీర్థజలాలతో స్వామివారికి శాస్త్రోక్తంగా అభిషేకం నిర్వహించారు. ఆలయ పవిత్రత, దైవశక్తి మరింత వృద్ధి చెందాలని, సర్వలోకాలకు శ్రీనివాసుని అనుగ్రహం కలగాలని అర్చకులు భక్తిశ్రద్ధలతో ఈ విశిష్ట క్రతువును నిర్వహించారు. అంతకుముందు చతుస్థానార్చన, మూర్తి హోమం, అష్టబంధనం తదితర కార్యక్రమాలను ఆగమశాస్త్ర విధానాలను అనుసరించి నిర్వహించారు. సాయంత్రం శయ్యాధివాసం, తత్వ హోమాలు, శాంతి హోమం, శాత్తుమొర కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

**ఆగస్టు 26న మహాసంప్రోక్షణ**

ఆగస్టు 26న ఉదయం 7 గంటలకు చతుస్థానార్చన, మూర్తి హోమం, ప్రాయశ్చిత్త హోమం నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 9.45 నుంచి 11.30 గంటల వరకు శ్రవణా నక్షత్రం, తులా లగ్నంలో మహా పూర్ణాహుతి, మహాసంప్రోక్షణ, కళాకర్షణ కార్యక్రమాలను ఆగమశాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. మహాసంప్రోక్షణ కార్యక్రమాలు పూర్తయిన అనంతరం భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించనున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ డెప్యూటీ ఈవో శ్రీమతి ఎ. ప్రశాంతి, ఏఈవోరవి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# ఏపీ వ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీతో అభివృద్ధి చేస్తున్నాం

**ఏపీ-సుజ్లాన్ భాగస్వామ్యంతో 12వేల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ**

**రాయదుర్గం నియోజకవర్గంలో సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి లోకేష్**

**అంకుశం ప్రతినిధి అనంతపురం ఆగస్టు 25**
పునరుత్పాదక ఇంధన రంగంలో ఏపీని నంబర్ వన్‌గా నిలబెట్టడమే మన లక్ష్యమని, సుజ్లాన్ పవన విద్యుత్ ప్రాజెక్ట్ ఏపీ నూతన అధ్యాయానికి నాంది అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు మండలం హులికెర వద్ద సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ఈ రోజు అనంతపురం జిల్లాలో మీ అందరి మధ్య ఉండటం ఎంతో ఆనందంగా ఉంది. ఈ రోజు ఆంధ్రప్రదేశ్ నూతన అధ్యాయానికి నాంది. ఈ రోజు సుజ్లాన్, ఏపీ మధ్య రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న బంధాన్ని పునరుద్ధరించుకునే సందర్భం కూడా. సుజ్లాన్ తొలినాళ్లలోనే ఏపీకి వచ్చి, తయారీ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసి, బలమైన విండ్ ఎనర్జీ ఎకో సిస్టమ్ నిర్మించింది. సుజ్లాన్ గురించి మాట్లాడేటప్పుడు దివంగత తులసి తంతి గారిని మనం స్మరించుకోవాలి. స్వచ్ఛ ఇంధనం ప్రపంచ ప్రాధాన్యతగా మారకముందే ఆయన పునరుత్పాదక ఇంధనంపై నమ్మకం ఉంచారు. - మిగతా 2లో












# ఏపీ వ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ తో అభివృద్ధి చేస్తున్నాం

-మొదటిపేజీ తరువాయి

ఆయన ఆలోచన చాలా సింపుల్. భారతదేశ ఆర్థిక స్వావలంబనకు ఇంధన స్వావలంబన అత్యంత అవసరం. ఆ దార్శనికతకు అనంతపురంలోనే బలమైన పునాది పడింది.

**అనంతలో 1,260 మెగావాట్ల సామర్థ్యం సుజ్లాన్ సొంతం**

2019–24 మధ్య రాష్ట్రంలో పవన విద్యుత్ అభివృద్ధి దాదాపుగా నిలిచిపోయింది. కేవలం 6 మెగావాట్ల పవన విద్యుత్ సామర్థ్యం మాత్రమే అదనంగా చేరింది. నేడు అనంతపురంలోని సుజ్లాన్ యూనిట్‌కు ఏడాదికి సుమారు 1,260 మెగావాట్ల తయారీ సామర్థ్యం ఉంది. ప్రత్యక్షంగా సుమారు 1,200 మందికి ఉపాధి కల్పిస్తోంది. వారిలో 70 శాతానికి పైగా స్థానికులే. ఏపీ వ్యాప్తంగా సుజ్లాన్ ఇప్పటికే 2 వేలకు పైగా గ్రీన్ ఉద్యోగాలను సృష్టించింది. పారిశ్రామికీకరణ అంటే ఇలాగే ఉండాలి. ఒక జిల్లాకు పెట్టుబడులు రావాలి. ఆ జిల్లాలో తయారీ రంగం అభివృద్ధి చెందాలి. ఆ జిల్లాలో నైపుణ్యాలు పెరగాలి. యువతకు వారి సొంత జిల్లాలోనే ఉద్యోగాలు లభించాలి.

**విండ్ ఎనర్జీ రంగంలో మన దేశం సత్తా చాటింది సుజ్లాన్**

భారతదేశ పవన విద్యుత్ రంగాన్ని ప్రపంచ పటంలో నిలిపిన సంస్థల్లో సుజ్లాన్ ఒకటి. పట్టుదల, పునరుద్ధరణ సామర్థ్యంతో సుజ్లాన్ సంస్థ అత్యున్నత విజయాలను చూసింది. అత్యంత క్లిష్టమైన పరిస్థితులను కూడా ఎదుర్కొంది. అయినప్పటికీ సుజ్లాన్ ఎప్పుడూ కనుమరుగుకాలేదు. ఎందుకంటే నిబద్ధతతో కూడిన ఈ సంస్కృతిని తులసి తంతి గారు ఏర్పరచగా, ప్రస్తుత నాయకత్వం దానిని ముందుకు తీసుకెళ్లింది.

**సౌర, పవన విద్యుత్, నిల్వ సాంకేతికతలు కలిసి పనిచేయాలి**

ఆంధ్రప్రదేశ్‌కు పవన విద్యుత్ భవిష్యత్ ఇంధన మిశ్రమంలో కీలక భాగం. భారతదేశంలో సూర్యరశ్మి సమృద్ధిగా ఉంది. పగటి సమయంలో సౌర విద్యుత్ కీలక పాత్ర పోషిస్తుంది. కానీ ప్రతి సాయంత్రం సూర్యుడు అస్తమిస్తాడు. మన ఆర్థిక వ్యవస్థ మాత్రం ఆగదు. సాయంత్రం 6 గంటలకైనా మన ఇళ్లకు విద్యుత్ అవసరం ఉంటుంది. మన పరిశ్రమలు పనిచేస్తూనే ఉంటాయి. మన ఆసుపత్రులు పనిచేస్తూనే ఉంటాయి. మన డేటా సెంటర్లు ప్రతి క్షణం సమాచారాన్ని ప్రాసెస్ చేస్తూనే ఉంటాయి. అందుకే సౌర, పవన విద్యుత్, నిల్వ సాంకేతికతలు కలిసి పనిచేయాలి. ఆంధ్రప్రదేశ్ దేశంలోని అతిపెద్ద డేటా సెంటర్ పర్యావరణ వ్యవస్థల్లో ఒకదాన్ని నిర్మిస్తున్నందున ఇది మరింత కీలకంగా మారుతోంది. మేం 6.5 గిగావాట్ల డేటా సెంటర్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తున్నాం. ఈ డిజిటల్ మౌలిక వసతులకు అవసరమైన విద్యుత్‌ను అందించేందుకు సుమారు 25 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన అవకాశాన్ని సృష్టించవచ్చు.

**రాష్ట్రవ్యాప్తంగా 22 క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నాం**

పూర్తిస్థాయి ఇండస్ట్రియల్ ఎకోసిస్టమ్ నిర్మాణంలో భాగంగా ఎనర్జీ, డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, ఫార్మాస్యూటికల్స్, ఆటోమొబైల్, కెమికల్స్, ఫిషరీస్, ఆక్వాకల్చర్, మ్యానుఫ్యాక్చరింగ్ వంటి అధిక వృద్ధి రంగాల్లో 22 పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటు దిశగా ముందుకు వెళ్తున్నాం. క్లస్టర్లు ఎందుకంటే.. కంపెనీలు ఒంటరిగా పెట్టుబడులు పెట్టవు. అవి ఎకోసిస్టమ్ లో పెట్టుబడులు పెడతాయి. అందుకే మా విధానం చాలా సులభం. కేవలం ఒక కంపెనీని తీసుకురావడం కాదు.. ఆ కంపెనీ చుట్టూ పూర్తి ఎకోసిస్టమ్ ను నిర్మించాలి. ఒక కంపెనీ సప్లయర్స్ ను తీసుకొస్తుంది. సప్లయర్స్ మరిన్ని కంపెనీలను తీసుకొస్తారు. కంపెనీలు ఉద్యోగాలను సృష్టిస్తాయి. ఉద్యోగాలు స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. దీంతో పెద్దఎత్తున పెట్టుబడులు తరలివస్తాయి.

**ఏపీ–సుజ్లాన్ భాగస్వామ్యంతో 12వేల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ**

ఈ భాగస్వామ్యంలో గర్వంగా అనిపించే మరో అంశం నైపుణ్యాభివృద్ధి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సుజ్లాన్ కలిసి 12వేల మంది యువతకు, అందులో 25 శాతం మహిళలకు ప్రాతినిధ్యం ఉండేలా గ్రీన్ ఎనర్జీ ఉద్యోగాల కోసం శిక్షణ అందిస్తున్నాయి. ఉరవకొండ, విజయవాడలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు పునరుత్పాదక ఇంధన రంగానికి అవసరమైన ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులను సిద్ధం చేస్తున్నాయి. రేపటి కంపెనీలు నైపుణ్యం ఉన్న ప్రాంతాలకే వస్తాయి. ఆ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఆంధ్రప్రదేశ్ యువత సిద్ధంగా ఉండేలా చూడటం మన బాధ్యత. భారతదేశ స్వచ్ఛ ఇంధన భవిష్యత్తు కోసం శిక్షణ పొందుతున్న యువ ఇంజనీర్లు, సాంకేతిక నిపుణుల ద్వారా స్వర్గీయ తులసి తంతి గారి వారసత్వం మరోసారి కొనసాగుతోంది.

**అనంతపురం కొత్త కేరాఫ్ అడ్రస్ ఇదే..**

అనంతపురం జిల్లా అంటే కియా కార్లు, ఫైటర్ జెట్లు, సుజ్లాన్ రెన్యూవబుల్ ఎనర్జీ. ఒకప్పుడు అనంతపురం జిల్లా నుంచి యువత ఉపాధి, ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు, ఇతర జిల్లాలకు వెళ్లేవారు. ఇప్పుడు ఆ రోజులు పోయాయి. ఇతర ప్రాంతాల వాళ్లు ఉద్యోగాలు వెతుక్కుంటూ అనంతపురం జిల్లాకు వచ్చే రోజులు వచ్చాయి. ఇదంతా మన ఏపీ బ్రాండ్, విజనరీ ముఖ్యమంత్రి చంద్రబాబు గారి వల్లే సాధ్యమైంది.

**20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం**

ఒక్క కియా పరిశ్రమ ఎన్ని కుటుంబాల్లో వెలుగు నింపిందో నేను పాదయాత్రలో స్వయంగా చూశాను. అప్పుడే 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలి అనే లక్ష్యంగా పెట్టుకున్నాను. ప్రపంచమంతా తిరిగి కంపెనీలను తీసుకువస్తున్నాం. మన గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు కూడా మన రాష్ట్రానికి కంపెనీలను తీసుకురావడానికి సహకరిస్తున్నారు. కంపెనీలను తీసుకురావడం మా బాధ్యత.

ఆ అవకాశాలను అందిపుచ్చుకోవడం యువత బాధ్యత. మీ పని తీరుబట్టే మరిన్ని కంపెనీలు ఏపీకి వస్తాయి. అందుకే నైపుణ్యాలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. పరిశ్రమలతో నేరుగా అనుసంధానం చేసి, యువతకు అవసరమైన నైపుణ్యాలను నేర్పించాలని కోరుతున్నాం.

**మన భవిష్యత్ మనమే నిర్మించుకుందాం**

ప్రభుత్వం, పరిశ్రమలు, యువత కలిసి పనిచేసినప్పుడు ఎంత అద్భుత ఫలితాలు వస్తాయో మనం చూస్తున్నాం. పరిశ్రమలు పెట్టుబడులు, సాంకేతికతను తీసుకువస్తాయి. మన యువత ప్రతిభను, ఆశయాలను తీసుకువస్తారు. మనమంతా కలిసి అభివృద్ధిని సృష్టిస్తాం. ఏపీపై విశ్వాసం ఉంచిన గిరీష్ తంతి, అజయ్ కపూర్ కు, మొత్తం సుజ్లాన్ బృందానికి ధన్యవాదాలు. ఈ రోజు మనం కేవలం పవన విద్యుత్ ప్రాజెక్టులకు భూమిపూజ చేయడం లేదు. ఇంధనం, తయారీ, సాంకేతికత, ప్రతిభ ఆధారంగా నిర్మించబోయే కొత్త పారిశ్రామిక ఆంధ్రప్రదేశ్‌కు పునాది వేస్తున్నాం. ఈ రోజు ఇక్కడ ఉన్న ప్రతి పెట్టుబడిదారుడికి, పారిశ్రామికవేత్తలకు ప్రముఖుడికి నా సందేశం ఒక్కటే.. మా స్పీడ్, స్టెబిలిటీ, కమిట్ మెంట్, ఎగ్జిక్యూషన్ ను నమ్మండి. ఎందుకంటే మీరు ఏపీలో విజయవంతమైతే, ఏపీ కూడా మీతో కలిసి విజయవంతమవుతుంది. భవిష్యత్తు కోసం మనం ఎదురుచూడబోం. స్వచ్ఛ ఇంధనం, కొత్త పరిశ్రమలు, కొత్త ఉద్యోగాలు, కొత్త నైపుణ్యాలతో భవిష్యత్తును మనమే నిర్మించబోతున్నాం అని మంత్రి నారా లోకేష్ అన్నారు.

# మన కార్యకర్తల కోసం నిలబడాల్సిన ఎన్నికలు



-మొదటిపేజీ తరువాయి

. స్థానిక ఎన్నికలను నేతలు ఆషామాషీగా తీసుకోవద్దు. బలమైన అభ్యర్థులను నిలబెడదాం. గతంలో.. ఎంపీటీసీ, మున్సిపాలిటీ, జడ్పీ చైర్మన్, మేయర్ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు, ప్రలోభాలు చూశాం. అధికార పార్టీ ఎన్ని దౌర్జన్యాలు చేసినా నాయకుడు తనతోనే ఉన్నాడనే భరోసా ప్రతి కార్యకర్తకు కలగాలి. ఇప్పుడు కార్యకర్తకు అండగా నిలబడితేనే, రేపు సాధారణ ఎన్నికల్లో అతడు రెట్టించిన ఉత్సాహంతో పార్టీ కోసం పనిచేస్తాడు" అని వైఎస్ జగన్ అన్నారు.

ప్రత్యక్ష ఎన్నికలు--బలమైన అభ్యర్థులు

స్థానిక సంస్థల పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం చేస్తున్న ప్రకటన ఒకరకంగా మనకు అనుకూలమే. అందుకే బలమైన అభ్యర్థులను నిలబెట్టాలి. ప్రధాన పదవికి బలమైన అభ్యర్థి ఉంటే మిగిలిన ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, వార్డు అభ్యర్థులకు పర్యవేక్షణతోపాటు బలం లభిస్తుంది. అవసరమైన చోట కార్యకర్తలకు అండగా నిలిచేందుకు కుటుంబ సభ్యులను పోటీకి దింపడానికీ వెనకాడవద్దు. ప్రజల గొంతు వినిపించేలా, పార్టీ కార్యకర్తలకు భరోసా కల్పించేలా ప్రతి స్థానంలో పోటీ జరగాలి

**ఏకగ్రీవాలకు అంగీకరిస్తే కఠిన నిర్ణయం**

ఏ నియోజకవర్గంలోనూ పోటీ లేకుండా ఏకగ్రీవాలకు ఆస్కారం ఉండకూడదు. స్థానిక ఎన్నికల్లో ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే, తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడున్న కో–ఆర్డినేటర్ పార్టీ అభ్యర్థులు కాలేరు. ప్రతి నియోజకవర్గంలో ఎక్కడెక్కడ అభ్యర్థులను నిలబెట్టారో ఎన్నికల అనంతరం నివేదికలు తెప్పించుకుంటా. అభ్యర్థులను నిలబెట్టడమే కాకుండా వారికి ఎమ్మెల్యే అభ్యర్థులు ఎంత బలంగా మద్దతిచ్చారన్నదానిపైనా నివేదికలు తీసుకుంటా. కార్యకర్తల ఎన్నికల్లో మనం గట్టిగా నిలబడితేనే, మన ఎన్నికల్లో కార్యకర్తలు మన కోసం గట్టిగా నిలబడతారు.

**గ్రామస్థాయి ప్రచార కార్యక్రమం**

"వెన్నుపోటు పార్టీ--వెన్నుపోటు పాలన"పై గ్రామ కమిటీలు, అనుబంధ విభాగాలు ప్రతి గ్రామంలో ప్రచారం చేయాలి. ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ పాలనకు, కూటమి పాలనకు మధ్య తేడాను వివరించాలి. ఇంటింటి ప్రచారానికి అవసరమైన పూర్తి సమాచారాన్ని, ప్రచార సామగ్రిని పార్టీ అందిస్తుంది. కార్యక్రమాలన్నీ నిర్దిష్ట తేదీలు, షెడ్యూల్, వ్యవస్థీకృత కార్యాచరణ ప్రకారం జరగాలి.

**14--15 లక్షల గుర్తింపు కార్డులు**

పార్టీ కేడర్ కోసం దాదాపు 14--15 లక్షల గుర్తింపు కార్డులు సిద్ధమయ్యాయి. గ్రామస్థాయి కమిటీలు, అనుబంధ విభాగాల కార్యకర్తల వరకు గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తాం. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో సమావేశాలు నిర్వహించి గుర్తింపు కార్డులు అందించాలి. సమావేశాల్లో గుర్తింపు కార్డులతోపాటు ఇంటింటి ప్రచార సామగ్రినీ కేడర్‌కు పంపిణీ చేయాలి. గుర్తింపు కార్డుల్లో క్యూఆర్ కోడ్ ఉంటుంది; కార్యకర్తలు తమ ఫోన్లలోనే సమాచారాన్ని పొందవచ్చు. సెప్టెంబరు 5,6,7 తేదీల్లో ఒకరోజు ఏదో ఒకరోజు జిల్లాల స్థాయి సమావేశాలు నిర్వహిద్దాం. సెప్టెంబరు 8,9,10,11 తేదీల్లో ఏదో ఒకరోజు అసెంబ్లీ నియోజవకర్గాల స్థాయి సమావేశాలు నిర్వహిద్దాం. ఇక మండల, వార్డు, డివిజన్ స్థాయిల్లో సెప్టెంబరు 12 నుంచి 22 వరకూ సమావేశాలు నిర్వహిద్దాం.

**లీగల్, మీడియా సెల్స్ యాక్టివ్‌గా ఉండాలి**

ప్రతి నియోజకవర్గంలో లీగల్ సెల్, మీడియా సెల్‌లను వెంటనే బలోపేతం చేయాలి. పోటీ జరగకుండా అడ్డుకునేందుకు అధికార పార్టీ కేడర్‌పై దౌర్జన్యాలకు దిగే అవకాశం ఉంది; కార్యకర్తలను రక్షించుకోవాలి. నియోజకవర్గ స్థాయిలో సమర్థులైన న్యాయవాదులను ఒక వేదికపైకి తీసుకొచ్చి కార్యకర్తలకు అందుబాటులో ఉంచాలి. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర లీగల్ సెల్స్ పరస్పరం అనుసంధానమై పనిచేయాలి. అవసరమైన కేసులను హైకోర్టు వరకు తీసుకెళ్లేందుకు సమన్వయ వ్యవస్థ ఉండాలి. పోలీసుల వేధింపులకు గురయ్యే కార్యకర్తలను న్యాయపరంగా రక్షించాల్సిన బాధ్యత పార్టీ తీసుకోవాలి. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి లీగల్, మీడియా వ్యవస్థలన్నీ ఒకే యూనిట్‌గా పనిచేయాలి.

**సోషల్ మీడియాకు అత్యంత ప్రాధాన్యం**

ప్రతి నియోజకవర్గంలో సోషల్ మీడియాకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. పార్టీలో సోషల్ మీడియాలో చురుగ్గా ఉన్నవారిని గుర్తించి, మిగిలిన వారినీ యాక్టివేట్ చేయాలి. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి వేదికలపైకి మొత్తం పార్టీ కేడర్‌ను తీసుకురావాలి. సోషల్ మీడియా ఖాతాలు ఎలా ప్రారంభించాలి, ఎలా యాక్టివేట్ చేయాలి, ఎలా నిర్వహించాలనే అంశాలపై శిక్షణ ఇవ్వాలి. జగన్ 2.0 సూపర్ యాప్, వైయస్సార్‌సీపీ టాక్స్, పార్టీ సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజల్లోకి సందేశం తీసుకెళ్లాలి. పార్టీకి సంబంధించిన యూట్యూబ్ ఛానళ్లు, సోషల్ మీడియా వ్యవస్థలను సమర్థంగా ఉపయోగించుకోవాలి. పార్టీ కేడర్‌కు వాస్తవ సమాచారం, అవసరమైన న్యూస్ కంటెంట్ నిరంతరం అందాలి. నియోజకవర్గాల్లోని సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను వ్యక్తిగతంగా కలిసి పార్టీకి మద్దతుగా నిలవాలని కోరాలి. ఎందుకంటే.. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 వంటి ప్రతికూల మీడియా వ్యవస్థలతో మనం యుద్ధం చేస్తున్నాం.

**నాయకులకు హెచ్చరిక**

నియోజకవర్గాల్లో మీడియా, సోషల్ మీడియా, లీగల్ సెల్స్‌పై యాక్టివ్‌గా లేని నాయకులు ఇప్పటికైనా గేర్ మార్చాలి. నాయకులు కార్యకలాపాలను తమ నియంత్రణలోకి తీసుకోకపోతే కార్యకర్తలు నష్టపోతారు. ఇంటింటి ప్రచారం ద్వారా ప్రతి కుటుంబానికి వైయస్సార్‌సీపీ--కూటమి పాలన మధ్య తేడాను వివరించాలి.

**ఈగోలకు తావులేదు**

స్థానిక ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య తక్కువగా ఉంటుంది కాబట్టి అభ్యర్థి వ్యక్తిగత బలం అత్యంత కీలకం. అభ్యర్థుల ఎంపికలో భావోద్వేగాలు, వ్యక్తిగత ఈగోలను పక్కనపెట్టి అందరినీ కలుపుకొని వెళ్లాలి. తొమ్మిది ఓట్లతో గెలిచిన సందర్భాలు, తొమ్మిది ఓట్లతో ఓడిన సందర్భాలూ ఉన్నాయి. కాబట్టి ప్రతి ఓటూ కీలకమే. "జో జీతా వహీ సికందర్".. గెలుపే ముఖ్యం, గెలుపు కోసం ఈగోలను పక్కన పెట్టాలి. ప్రతి గ్రామంలో పార్టీని బలంగా కన్సాలిడేట్ చేసి, సమర్థుడైన కార్యకర్త చుట్టూ ఏకాభిప్రాయం సృష్టించాలి. రాబోయే 60--70 రోజులు నాయకులు తమ నియోజకవర్గాలను దాటి వెళ్లకుండా పూర్తిగా స్థానిక ఎన్నికలపైనే దృష్టిపెట్టాలి. సరైన శ్రద్ధ, పూర్తి స్థాయి కార్యాచరణ ఉంటే స్థానిక ఎన్నికల్లో గెలుపు జెండా ఎగరేస్తాం

**వాళ్ల పేర్లు డిజిటల్ బుక్‌లోకి..**

పోలీసు అధికారులు పదవిని దుర్వినియోగం చేయకుండా న్యాయంగా, ధర్మంగా వ్యవహరించాలి. కానీ అలా జరగడం లేదు. కార్యకర్తలను వేధించే, అన్యాయం చేసే అధికారుల వివరాలను నమోదు చేయాలి. చట్టవిరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై భవిష్యత్తులో చట్టప్రకారం చర్యలు తప్పవు. ప్రతి పోలీసు అధికారి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా తటస్థంగా వ్యవహరించాలని కోరుతున్నాం. పోలీసు వ్యవస్థలో నిష్పాక్షికత తీసుకురావడానికి పార్టీ నాయకులు గట్టి ప్రయత్నం చేయాలి అని వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారు.

## దుర్గంకు ఎనర్జీ "సుజ్లాన్"..!!

-మొదటిపేజీ తరువాయి

అనంతరం సుజ్లాన్ 1,325 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులకు శంకుస్థాపనతో పాటు సుజ్లాన్ ూ144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్ ను మంత్రి ప్రారంభించారు. శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన ఏవీని మంత్రి వీక్షించారు. అంతకుముందు బళ్లారి సమీపంలోని హలకుంది గ్రామంలో సుజ్లాన్ బ్లేడ్ స్టాక్ యార్డును మంత్రి సందర్శించారు. సుజ్లాన్ ప్రతినిధులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విండ్ టర్బైన్ పై సంతకం చేశారు. సుజ్లాన్ సంస్థ ప్రస్తుతం 1,700కు పైగా మెగావాట్ల స్థాపిత సామర్థ్యంతో ఏపీలో అతిపెద్ద విండ్ భాగస్వామిగా అవతరించింది. 2030 నాటికి 5వేల మెగావాట్ల అదనపు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల స్థాపన లక్ష్యంగా సుజ్లాన్ సంస్థ ప్రణాళికలు రూపొందించి, వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది..ఈ కార్యక్రమంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా జీ.లక్ష్మీనారాయణ, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్, సుజ్లాన్ గ్రూప్ కో ఫౌండర్, వైస్ ఛైర్మన్ గిరీష్ తంతి, సీఈవో అజయ్ కపూర్, అడ్వైజర్ వీబీ రావు, టాటా పవర్ ఎండీ, సీఈవో సంజయ్ బంగా, సుజ్లాన్ గ్రూప్ డైరెక్టర్ రంజిత్ సిన్హా అభయ్ సిన్హా పర్మార్, ఎన్ఆర్ఈడీసీఏపీ లిమిటెడ్ వీసీ, మేనేజింగ్ డైరెక్టర్ ఎమ్.కమలాకర బాబు, టోరెంట్ పవర్ డైరెక్టర్ జిగీష్ మెహతా, వారీ ఎనర్జీస్ సీఎండీ హితేష్ దోషి, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పాల్గొన్నారు.

## 'స్థానికం'లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు ఖాయం..!!

-మొదటిపేజీ తరువాయి

కొగిర గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ, పెనుకొండ నియోజక వర్గంలో 85 శాతం మేర ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తంచేస్తున్నారని, తమ నాయకులకు, కార్యకర్తలకు ఘన స్వాగతం పలుకుతున్నారని ఆమె ఆనందం వ్యక్తంచేశారు.

**బీసీల గురించి మాట్లాడే అర్హత జగన్ కు లేదు**

నా బీసీలంటూ అధికారంలోకి వచ్చిన జగన్ బడుగు, బలహీన వర్గాల వారిని తన అయిదేళ్ల పాలనలో అణగదొక్కారని మంత్రి సవిత మండిపడ్డారు. సంక్షేమం, స్వయం ఉపాధి పథకాలు నిలిపేసి ఆర్థికంగా నిలదొక్కుకోకుండా అడ్డుకున్నారన్నారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి కుదించి, బీసీలను రాజకీయంగా దెబ్బతీశారన్నారు. దీనివల్ల బీసీలు 16,800 పదవులకు దూరమయ్యాయని మంత్రి ఆవేదన వ్యక్తంచేశారు. బీసీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారన్నారు. బీసీ బిడ్డలు చదువుకోవడం ఇష్టం లేక బీసీ హాస్టళ్లను, గురుకులాలను గాలికొదిలేశారన్నారు. ఇదేంటని ప్రశ్నించిన బీసీ నాయకులను అక్రమ కేసులు బనాయించి, జైల్లో నిర్బంధించారన్నారు. చివరికి బీసీలకు రక్షణ లేకుండా చేశారన్నారు. బీసీ బిడ్డపై పెట్రోల్ పోసి తగులబెట్టారన్నారు. వైసీపీ హయాంలో బీసీల జీవితం నరకప్రాయం మారిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తుండడంతో, బీసీలపై జగన్ మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. బీసీల గురించి మాట్లాడే అర్హత జగన్ లేదని మంత్రిసవిత స్పష్టం చేశారు.

**జగన్ అవినీతికి బీసీలు బలి**

జగన్ అవినీతి, అక్రమార్జనకు వైసీపీకి చెందిన బీసీ నాయకులు బలైపోతున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. బీసీ నాయకులకు పదవులు ఆశ చూపి, వారిని అక్రమ మద్యం తయారీ, మద్యం రవాణా, ఇసుక అక్రమ తవ్వకాలు ఇలాంటి కేసులు వారిని పావులుగా చేశారన్నారు. జగన్ ధన దాహానికి ఆయా కేసుల్లో బీసీలు ఇరుక్కోవడం బాధాకరమని మంత్రి సవిత అన్నారు. బీసీల మేలు కోరే సీఎం చంద్రబాబునాయుడు వారి రక్షణ కోసం బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్నారని మంత్రి సవిత వెల్లడించారు.


**34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతాం...**

స్థానిక సంస్థల్లో బీసీలకు మొట్టమొదటి సారిగా అన్న ఎన్టీఆర్ 27 శాతం మేర రిజర్వేషన్లు కల్పించారని మంత్రి సవిత గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచారన్నారు. 2013లో జరిగిన ఎన్నికల్లో ఆ రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయన్నారు. 2021లో బీసీ రిజర్వేషన్లను జగన్ 24 శాతానికి కుదించారన్నారు. దీనివల్ల బీసీలకు 16,800 పదవులకు దూరమయ్యారన్నారు. బీసీల సంక్షేమం కోరే సీఎం చంద్రబాబునాయుడు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్ల అమలు చేయాలని నిర్ణయించారన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామన్నారు. అంతకుముందు కొగిరి గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన టీడీపీ కార్యకర్త ఆంజనేయుల కుటుంబానికి మంత్రి సవిత పరామర్శించారు. రూ.5 లక్షల జీవిత బీమా చెక్ ను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. టీడీపీ కార్యకర్తల కుటుంబాల సంక్షేమమే మంత్రి నారా లోకేశ్ లక్ష్యమన్నారు. ఆయన ముందు చూపుతో అమలుచేసిన రూ.5 లక్షల జీవిత బీమా కష్టకాలంలో ఉన్న బాధిత కుటుంబాలకు ఆసరాగా ఉంటోందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పసురు ముందు ప్రాణం తీసిందా.

**లిక్కర్ మానేద్దామని అడవి పసురు తాగితే ఆయువు ఆవిరి.**

**అనుమానాస్పద స్థితిలో కర్ణాటక వాసి మృతి.**



**గోరంట్ల** పసురు ముందు తాగిన దాదాపు గంట ఎవరిలోనే నిండు ప్రాణాలు బలహీన సంఘటన పలు అనుమానాలకు దారితీస్తోంది, మద్యం అలవాటును మానుకుందామని అందుకోసం ఓ అటవీ ప్రాంత గ్రామంలో పసురు ముందు తెలిసి కర్ణాటక ప్రాంతం నుంచి వచ్చి పసురు ముందు తాగిన కొద్దిసేపట్లోనే ఆ వ్యక్తి మృతి చెందిన సంఘటన గోరంట్ల మండలంలో చోటుచేసుకుంది. ఈ సంఘటనలో కర్ణాటక రాష్ట్రంలోని పేరేసంద్ర ప్రాంతంలో ని బాజేపల్లి గ్రామానికి చెందిన సతీష్ (40 ) మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది.

వివరాల్లోకెళితే మృతునితోపాటు మృతిని స్వగ్రామ సమీప ప్రాంతాలకు చెందిన తిప్పన రామిరెడ్డి మంజు అనే వ్యక్తులు మృతునితో కలిసి బాగేపల్లి కూరగాయల మార్కెట్లో వ్యాపారం ముగించుకొని మంగళవారం ఉదయం గోరంట్ల మండలంలోని అడవి గంగిరెడ్డిపల్లి ప్రాంతానికి వచ్చి ఓ గ్రామంలో ఓ వ్యక్తి ద్వారా మద్యం మానేసేందుకు మృతునితోపాటు మరో ముగ్గురు కలసి అందరూ పసురుమందు తాగి అక్కడ నుంచి ఆటోలో గోరంట్లవైపు బయలుదేరారు. అయితే అక్కడి నుంచి ఆటోలో బయలుదేరిన దాదాపు 5 కిలోమీటర్ల దూరం రాగానే మృతుడు సతీష్ ఒక్కసారిగా స్పృహ లేకుండా పడిపోయాడని చూస్తే చనిపోయాడని మాకు ఇంతే తెలుసని వెంట ఉన్నవాళ్లు సూచిస్తున్నారు. మృతున్ని హుటాహుటిన గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించగా అతను ఇప్పటికే చనిపోయి ఉన్నాడని డాక్టర్లు నిర్ధారించారు. సమాచారం తెలుసుకున్న గోరంట్ల సీఐ బోయ శేఖర్, ఎస్ఐ రాము, ఎస్సై నిర్మల తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని వివరాలను నమోదు చేసుకున్నారు. మృతుడు సతీష్ మరణం పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసుల దర్యాప్తులో అతని మరణాన్ని గల వాస్తవ విషయాలు తెలియాల్సి ఉంది.

# రోడ్డు ప్రమాదాల్లో మరణించిన కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక సాయం

## రూ.10లక్షల ఇన్సూరెన్స్ పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే పరిటాల సునీత

**అంకుశం న్యూస్ అనంతపురం ఆగస్టు 25** రోడ్డు ప్రమాదంలో మరణించిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కుటుంబాలకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత రూ.10లక్షల ఇన్సూరెన్స్ పత్రాలను అందజేశారు. రాప్తాడు మండలం, బండమీదపల్లి గ్రామానికి చెందిన అంకె భాస్కరప్ప, అనంతపురం రూరల్ మండలం సోమలదొడ్డి గ్రామానికి చెందిన దాసరి రామకృష్ణ రోడ్డు ప్రమాదంలో మరణించారు. పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీత వారికి తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఉండటంతో పార్టీ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఇన్సూరెన్స్ పత్రం పార్టీ కార్యాలయం నుంచి వచ్చింది. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రమాద బీమా పత్రాలను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మండలాల టిడిపి నాయకులు, బాధితుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బాబు గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం ఆత్మకూరు



మండలం ముట్టాల పంచాయతీ పాపంపల్లి గ్రామానికి చెందిన చవ్వా మానసకి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. తీవ్ర అనారోగ్యానికి గురైన మానస ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సలు పొందారు. భారీగా డబ్బు ఖర్చు కావడంతో ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి విషయాన్ని తీసుకొచ్చారు. దీంతో ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రత్యేకంగా మాట్లాడి 7లక్షల 50వేల రూపాయలు మంజూరయ్యేలా చూశారు. మానసకు తన క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు మండల నాయకులతో కలిసి రూ.7.50లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. మానస ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఎప్పుడు ముందుంటారని అన్నారు. పార్టీ కోసం కష్టపడే ఏ కార్యకర్తకు కష్టం వచ్చినా.. ఆ కుటుంబం ఇబ్బంది పడకూడదని కేవలం 100 రూపాయలతో ఐదు లక్షల రూపాయల వరకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించిన నాయకుడు నారా లోకేష్ అన్నారు. దీని ద్వారా ఎంతోమంది కార్యకర్తల కుటుంబాలకు న్యాయం జరుగుతోందని అన్నారు. మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల ఆరోగ్యం విషయంలో ఉదారంగా స్పందిస్తున్నారని.. కొందరు ప్రైవేటు ఆసుపత్రిల్లో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే ఆయన సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం చేస్తున్నారని వివరించారు....

# పవన విద్యుత్ ప్రాజెక్టులతో అనంతపురం జిల్లా అభివృద్ధికి కొత్త ఊపిరి

## పవన విద్యుత్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్






**అంకుశం న్యూస్ రాయదుర్గం ఆగస్టు 25** అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు సమీపంలో సుజలాన్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న బ్లేడ్ తయారీ యూనిట్, 1200 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులకు మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేయడం సంతోషకరమైన విషయమని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ గారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ శాఖల మంత్రి నారా లోకేష్ గారు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు , ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ గారు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు గారితో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు మాట్లాడుతూ అనంతపురం జిల్లా పారిశ్రామిక, ఇంధన రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందేందుకు ఈ ప్రాజెక్టులు కీలకంగా నిలుస్తాయని తెలిపారు. సుజలాన్ బ్లేడ్ తయారీ యూనిట్, పవన విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా జిల్లాకు భారీ పెట్టుబడులు రావడంతో పాటు స్థానిక యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో, మంత్రి నారా లోకేష్ గారి చొరవతో రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడిందని పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో ఉన్న అపారమైన పునరుత్పాదక ఇంధన వనరులను సద్వినియోగం చేసుకుంటూ మరిన్ని పరిశ్రమలు, భారీ పెట్టుబడులు తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పచ్చ ఇంధనం, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలతో అనంతపురం జిల్లాను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో అనంతపురం జిల్లా రాష్ట్రంలోనే కీలకమైన పారిశ్రామిక, పునరుత్పాదక ఇంధన కేంద్రంగా ఎదుగుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

# నేతన్న సేవ 25 వేలు వెంటనే ఇవ్వాలన్న డిమాండ్‌తో ధర్నాకు పిలుపు!



**శుక్రవారం28 వతేది ధర్మవరం ఆర్డిఓ ఆఫీస్ ముందు. ధర్నా జయప్రదం చేయండి**

**అంకుశం న్యూస్ ధర్మవరం ఆగస్టు 25** ఏపీ చేనేత కార్మిక సంఘం (జ ఎణా రి. నెం.48/2022) స్వాతంత్రం అనంతరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక పారిశ్రామిక విధానాల ఫలితంగా కార్పొరేట్ వ్యాపారులు పెద్ద ఎత్తున సాంప్రదాయ చేతి వృత్తులలో సేవా రంగాలలో ప్రవేశించడం వల్ల చేతి వృత్తిదారుల జీవనం మరింత దుర్భరంగా మారింది నీకింత నాకంత నేతన్నకు మ?గ్గంత వ్యవహారం నడిపిన కూటమి నాయకుల తీరుతో చేనేత కార్మికులు ఆందోళన చెందుతున్నారు. జీవో నెం.187 ప్రకారం ఒక్కో కుటుంబానికి 25000 అయితే 51.952 మందికి 129.88 కోట్ల రూపాయలు అవుతుంది. 2019-20 అఖిలభారత చేనేత గణన ప్రకారం రాష్ట్రంలో 1.2 లక్షల మందికి పైగా చేనేత కార్మికులు ఉన్నారు 7 తేదీ జాతీయ చేనేత దినోత్సవం రోజు జీవో ౫ నెం.44 ప్రకారం 7.90 కోట్లు చేనేత కుటుంబాలకు ఇచ్చారు. చేనేత అనేది ఒక వృత్తి కులం కాదు ఆర్యవైశ్య. ఈ బీసీ. కమ్మ. కాపు. రెడ్డి. మొదలైన వర్గాలకు చెందిన చేనేత కార్మికులకు వేరువేరు కార్పొరేషన్ల ద్వారా కొంచెం కొంచెం 6%.5%.4.3. శాతాలుగా ఇస్తుండడం పట్ల అనేక అనుమానాలకు దారి తీస్తున్నది. ఇప్పటివరకు మొత్తం 20% కూడా బ్యాంకు ఖాతాలో లేకి రాలేదు ఈనెల 20 లోపు కార్మికులందరికీ ఇచ్చేస్తామని చేనేత మంత్రి గారు హామీ ఇచ్చినా అమలకు నోచుకోలేదు. రాష్ట్రంలో 1,20, వేల మందికి ఇవ్వగలిగినా 300 కోట్లకు మించదు ప్రభుత్వానికి అతి చిన్న విషయమే కానీ నేతన్నలను ఆదుకోవాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉండాలి. చేనేత కార్మికులు ఉద్యమాలకు సిద్ధం కాక తప్పదు 29వ తేదీ ఉదయం 10.30.కి. గంటల నుండి ఆర్డీవో ఆఫీస్ ముందు ధర్నా చేపట్టడం జరుగుతున్నది చేనేత మిత్రులు కార్మికులు 25000 ఇంకా రాని ధర్మవరంలో చేనేత కార్మికులు అందరూ హాజరు కావలసిందిగా నేతన్నలకు విజ్ఞప్తి చేశారు

డిమాండ్లు:

1)చేనేత కార్మికులందరికీ ఒకేసారి 25000 బ్యాంకు ఖాతాల్లోకి వేయాలి.

2) నేతన్నలకు ఎగ్గొట్టిన 2024-25 రెండు సంవత్సరాలు మొత్తం కూడా ప్రభుత్వం ఇవ్వాలి ఇవ్వాలి

3) కుల కార్పొరేషన్ల ద్వారా వికేంద్రీకరణ కాకుండా హ్యాండ్లూమ్ డిపార్ట్మెంట్ ద్వారా ఇవ్వాలి

4) చేనేత కార్మికుల డేటా బేస్ ను ఆన్ లైన్ లో బహిరంగపరచాలి

5) అనుబంధ చేనేత కార్మికులకు వస్త్ర తయారీలో భాగస్వామ్యం అవుతున్న కార్మికులందరికీ 25 వేలు ఇవ్వాలి

6) టెక్స్ టైల్ పాలసీ 2024-29 లో చేనేత రంగానికి ప్రత్యేక చాప్టర్ మరియు బడ్జెట్ కేటాయించాలి

7) జీవో.29.2019 యాక్ట్ అమలు చేయాలి. ఫుల్ మిక్స్ హాట్ మిక్స్ నేస్తున్న పవర్లూమ్ కార్మికులకు కూలీలు తగ్గిస్తున్న యజమానులపై చర్యలు తీసుకోవాలి. ఈరోజు ధర్మవరం నేతన్న విగ్రహం దగ్గర కరపత్రాలు విడుదల చేయడం జరిగింది

ఈ కార్యక్రమానికి చేనేత చతుర్థి నాయకులు జింక చలపతి సిపిఐ నాయకులు మధు కార్యదర్శి రవి వై రమణ చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు శ్రీ శ్రీనివాసులు సీనియర్ నాయకులు జ భుజంగం ఇతర చేనేత కార్మికులు పాల్గొన్నారు

## ఉరి వేసుకొని ఒకే కుటుంబం ఆత్మహత్య -విషాదశీ లో బత్తలపల్లి గ్రామం






**బత్తలపల్లి అంకుశశీ ఆగస్టు 25** శ్రీశైలంలో గదిలో ఉరివేసుకొని సుధాకర్ కుటుంబం ఆత్మ హత్య చేసుకున్నట్లు తెలిసింది.శ్రీ సత్య సాయి జిల్లా మండల కేంద్రమైన బత్తలపల్లి గ్రామానికి చెందిన సుధాకర్ కుటుంబం దైవ దర్శనార్థం గత నాలుగు రోజుల క్రితం శ్రీశైలం వెళ్లారు. వడ్డెర సత్రశీ లో బస చేసిన కుటుంబం రెండు రోజుల నుంచి గది నుంచి బయటకు రాకపోవడంతో పోలీసులు గది తలుపులు చూడగా ఉరి వేసుకుని ఐదు మంది కుటుంబ సభ్యులైన, సుధాకర్, మల్లేశ్వరి, శ్రీదేవి, ఆదిలక్ష్మి, మణికంఠ, ఆత్మహత్య చేసుకున్నారు. అవివాహితుడైన సుధాకర్ ఆటోలు అద్దెకిస్తూ, ముగ్గురు చెల్లెలు, మేనల్లుడుతో కలిసి జీవనం సాగిస్తున్నారు.

## స్థానిక ఎన్నికలపై వైయస్ జగన్ కీలక వ్యాఖ్యలు...



**అంకుశం న్యూస్,అనంతపురం, ఆగస్టు : 25** స్థానిక సంస్థల ఎన్నికలపై వైయస్సార్సీపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలు స్వచ్ఛందంగా. నిష్పక్షపాతంగా గనుక జరిగితే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు స్వచ్ఛమైన తీర్పు ఇస్తారని ఆయన అన్నారు. మంగళవారం వైయస్సార్సీపి ముఖ్య నేతలతో భేటీ అయిన వైఎస్ జగన్. పలు కీలక వ్యాఖ్యలు చేశారు.. ఇవి కేవలం గెలుపోటములకు సంబంధించిన ఎన్నికలు కావు. మనకార్యకర్తల కోసం నిలబడాల్సిన ఎన్నికలు ఎన్నికల స్వచ్ఛంగా జరిగితే. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా జనం ఓటేస్తారు. అందుకే చంద్రబాబు ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగనివ్వరు. స్థానిక ఎన్నికల్లో నేతలు ఆషామాషీగా తీసుకోవద్దు. బలమైన అభ్యర్థులను నిలబెడదాం గతంలో ఎంపీటీసీ, మున్సిపాలిటీ, జడ్పీ చైర్మన్, మేయర్ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం,దౌర్జన్యాలు, ప్రలోభాలు చూశాం. అధికార పార్టీ ఎన్ని దౌర్జన్యాలు చేసిన మానాయకుడు తనతోనే ఉన్నాడని భరోసా ప్రతి కార్యకర్తకు కలగాలి. ఇప్పుడు కార్యకర్తలకు అండగా నిలబడితేనే, రేపు సాధారణ ఎన్నికల్లో అతడు రెట్టింపు ఉత్సాహంతో పార్టీ కోసం పనిచేస్తాడు.. అని వైయస్ జగన్ అన్నారు...

**ప్రత్యక్ష ఎన్నికలు --- బలమైన అభ్యర్థులు..**

స్థానిక సంస్థల పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం చేస్తున్న ప్రకటన ఒక రకంగా మనకు అనుకూలమే. అందుకే బలమైన అభ్యర్థులను నిలబెట్టాలి. ప్రధాన పదవికి బలమైన అభ్యర్థి ఉంటే మిగిలిన ఎంపిటిసి, కార్పొరేటర్లు, వార్డు సభ్యులకు పర్యవేక్షణతో పాటు బలం లభిస్తుంది. అవసరమైన చోట కార్యకర్తల అండగా నిలిచేందుకు కుటుంబ సభ్యులను పోటీకి దింపడానికి వెనుకాడ వద్దు. ప్రజల గొంతు వినిపించేలా, పార్టీ కార్యకర్తలకు భరోసా కల్పించేలా ప్రతి స్థానంలో పోటీ జరగాలనీ మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి వైయస్ఆర్సీపీ కార్యకర్తలకు సూచనలు ఇచ్చాడు.

## తిరుమలలో ఇకపై ప్రతి మంగళవారం "క్లీనింగ్ డే"



**అంకుశం న్యూస్ తిరుమల ఆగస్టు 25** తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని భక్తులకు పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన ఆహారం అందించేందుకు టీటీడీ ఆరోగ్యశాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరిల ఆదేశాల మేరకు తిరుమలలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఇకపై ప్రతి మంగళవారం "క్లీనింగ్ డే" ప్రత్యేకంగా నిర్వహించాలని నిర్ణయించింది.ఇటీవల ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొంటోందని భక్తుల నుంచి ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో డిప్యూటీ ఈవో శ్రీ సోమన్నారాయణ ఆదేశాల మేరకు ఆరోగ్యశాఖ అధికారులు ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. వారం రోజుల పాటు వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే దుకాణాల పరిసరాల్లో పేరుకుపోయే వ్యర్థాలు, మురికి తదితరాలను తొలగించి పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను మూసివేసి సంపూర్ణంగా శుభ్రం చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఇందులో భాగంగా మంగళవారం తిరుమలలోని మూడో సత్రం, పీఏసీ--1, పీఏసీ--2 తదితర ప్రాంతాల్లోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను మూసివేసి పరిసరాలను శుభ్రం చేశారు. దుకాణాల్లో బొద్దింకలు, ఎలుకలు, బల్లులు తదితరాలు లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలని ఆరోగ్యశాఖ అధికారులు నిర్వాహకులకు సూచించారు. ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భక్తులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని ఆదేశించారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో పరిశుభ్రతకు సంబంధించి భక్తుల నుంచి ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. నిబంధనలు పాటించకుండా దుకాణాలను నిర్వహించే వారిపై టీటీడీ ఆరోగ్యశాఖ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో తిరుమలలో పారిశుద్ధ్యం, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.

# వసతి గృహాలలో విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు కల్పించాలి





విద్యార్థులకు ప్రతినెల క్రమం తప్పకుండా వైద్య పరీక్షల నిర్వహించాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్

**అంకుశం న్యూస్అనంతపురం, ఆగస్టు 25:-** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారి సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ పేర్కొన్నారు. మంగళవారం జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాలోని వివిధ శాఖల సంక్షేమ అధికారుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అధిక నిధులు ఖర్చు చేస్తూ వారి సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర శాఖల అధికారులు సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని వసతి గృహాలలో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేసి విద్యార్థులకు స్వచ్ఛమైన త్రాగునీరు ఇవ్వడం జరుగుతుందని ఆర్వో ప్లాంట్ లేని చోట గోరువెచ్చని నీటిని విద్యార్థులకు ఇవ్వాలన్నారు. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రతినెలా క్రమం తప్పకుండా ఆయా వసతి గృహాల సమీపంలో ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్లతో వైద్య పరీక్షలు తప్పక చేయించాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో పలు అంశాలపై జాయింట్ కలెక్టర్ అధికారులకు కూలంకుషంగా వివరించి దిశా, నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల సంక్షేమ అధికారులు, వారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నారా లోకేష్ కి బళ్లారిలో ఘన స్వాగతం

**బళ్లారిలోని జిందాల్ విజయ్ నగర్ ఎయిర్ పోర్ట్ కు చేరుకున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్**





**అంకుశం న్యూస్ రాయదుర్గం ఆగస్టు 25** కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారిలోమంత్రి లోకేష్ కు స్వాగతం పలికిన కర్ణాటక మంత్రి నాగేంద్ర, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, పల్లె సింధూర రెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ చల్లా లక్ష్మీ ప్రసాద్, టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉమర్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు కాసేపట్లో బళ్లారి మండలం హాలకుందిలోని సుజ్లాన్ బ్లేడ్ స్టాక్ యార్డును సందర్శించనున్న మంత్రి నారా లోకేష్ అనంతరం రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు మండలం హులికెర గ్రామంలో సుజ్లాన్ విండ్ పవర్ ప్రాజెక్ట్స్ కు శంకుస్థాపన చేయనున్న మంత్రి లోకేష్పవన విద్యుత్ ప్రాజెక్టులకు శంకుస్థాపనతో పాటు సుజ్లాన్ ఎా144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్ ను ప్రారంభించనున్న మంత్రి లోకేష్అనంతపురం జిల్లాలో రూ.10వేల కోట్లతో 1325 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటుచేయనున్న సుజ్లాన్ సంస్థ పవన విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 4వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్న సుజ్లాన్

## పేద మహిళకు సొంతింటికల నెరవేర్చి మానవత్వాన్ని చాటుకున్న మంత్రి సుభాష్

**మంత్రి పిలుపుతో మానవత్వం చాటుకున్న దాతలు**





**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఆగస్టు 25:** పేదల సంక్షేమమే తన రాజకీయ జీవిత లక్ష్యమని మరోసారి నిరూపిస్తూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఓ నిరుపేద మహిళ జీవితంలో వెలుగులు నింపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం మండలం సత్యవాడ గ్రామానికి చెందిన సలాది శేషవేణికి మంత్రి సుభాష్ చొరవతో సొంతింటి కల సాకారమైంది. భర్తను కోల్పోయి చిన్న కుమార్తెతో కలిసి పాడుబడిన గుడిసెలో దుర్భర జీవితం గడుపుతున్న శేషవేణి పరిస్థితిని గ్రామ పర్యటనలో మంత్రి సుభాష్ స్వయంగా గమనించారు. ఆమె బాధను అర్థం చేసుకున్న మంత్రి, ఈ కుటుంబానికి ఒక సురక్షితమైన గూడు ఉండాలి అని సంకల్పించారు. ఆ సంకల్పమే నేడు ఓ నిరుపేద కుటుంబానికి కొత్త జీవితాన్ని అందించింది. ఇంటి నిర్మాణం కోసం మంత్రి సుభాష్ స్వయంగా రూ.65 వేల ఆర్థిక సహాయం అందించడంతో పాటు, దాతలను ముందుకు తీసుకువచ్చి సేవా కార్యక్రమానికి ఊతమిచ్చారు. మంత్రి పిలుపునకు స్పందించిన దాతలు పామర్తి గోపి రూ.50 వేల, దేగల నాగేంద్ర రూ.25 వేల, యరంశెట్టి రాంబాబు రూ.10 వేల అందించగా, గ్రామ ప్రజలు సైతం తమ వంతు సహకారం అందించారు. అందరి భాగస్వామ్యంతో ఇంటి నిర్మాణం పూర్తై శేషవేణి కుటుంబం సొంతింట్లోకి అడుగుపెట్టే అదృష్టం దక్కింది. పూర్తయిన నూతన గృహాన్ని మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం ప్రారంభించి, గృహప్రవేశం చేయించారు. నూతన గృహప్రవేశం జరగడంతో శేషవేణి ముఖంలో ఆనందానికి వెల్లువిరిసింది. మంత్రి సుభాష్ చేస్తున్న సేవా కార్యక్రమాలు రాజకీయాలకు అతీతంగా మానవత్వానికి ప్రతీకగా నిలుస్తున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రజల కష్టాల్లో అండగా నిలిచి, అవసరంలో ఉన్నవారికి సహాయం అందించే నాయకుడు మంత్రి సుభాష్ అని కొనియాడారు. ఒక పేద మహిళకు గూడు కల్పించడం కేవలం ఇంటి నిర్మాణం కాదు... ఒక కుటుంబానికి భరోసా, భవిష్యత్తుకు భద్రత కల్పించడం అని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సత్యవాడ గ్రామ నాయకులు సలాది శ్రీను, ఎంపీటీసీ సలాది ఎర్రిబాబు, సలాది రమేష్, దేవరపల్లి చక్రి, తోట వెంకన్న, బందారు చిన్నబాబు, సలాది సర్వేష్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్త కుటుంబానికి మంత్రి సవితమ్మ పరామర్శ

**ప్రమాదంలో మృతి చెందిన రాహుల్‌కు నివాళులర్పించిన మంత్రి**



**అంకుశం న్యూస్ పెనుగొండ ఆగస్టు 25** శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలోని కోగిరి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త గంగన్న కుమారుడు రాహుల్ ఇటీవల బైక్ ప్రమాదానికి గురై, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి శ్రీమతి సవితమ్మ గారు కోగిరి గ్రామంలోని రాహుల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాహుల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి సవితమ్మ గారు తెలిపారు. రాహుల్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని భగవంతుడిని ప్రార్థించారు.

## రాప్తాడు మండలానికి మరో విద్యుత్ సబ్ స్టేషన్

**ఎమ్మెల్యే పరిటాల సునీతకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు**





**అంకుశం న్యూస్ అనంతపురం ఆగస్టు 25** రాప్తాడు నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు తీర్చడమే లక్ష్యంగా ఎమ్మెల్యే పరిటాల సునీత అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గానికి 5విద్యుత్ సబ్ స్టేషన్లను తీసుకురాగా... తాజాగా రాప్తాడు మండలం బండమీద పల్లి గ్రామానికి 33/11 కేవీ సబ్ స్టేషన్ మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో బండమీదపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే పరిటాల సునీతను అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా కలిశారు. ఆమెకు కృతజ్ఞతలు తెలుపుతూ సన్మానం చేశారు. ఎన్నో ఏళ్లుగా విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని... సబ్ స్టేషన్ రావడం వలన చాలావరకు అ సమస్యలు తీరుతాయని వారు అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ రైతులకు వ్యవసాయంలో విద్యుత్ కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే గ్రామాల్లో కూడా మెరుగైన విద్యుత్ సరఫరా కోసం కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే నూతన సబ్ స్టేషన్లు, ట్రాన్స్ ఫార్మర్లు పెద్ద ఎత్తున నియోజకవర్గానికి తీసుకొస్తున్నట్లు ఆమె చెప్పారు. త్వరలోనే 3కోట్ల రూపాయలతో ఈ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే సునీత తెలిపారు.....

## ఘనంగా జనసేనపార్టీ ఆత్మీయ సమావేశం





**పోరుమామిళ్ల, ఆగస్ట్ 25(అంకుశం పత్రిక):** పట్టణంలోని మలకత్తువ వద్ద వున్న వెంకటేశ్వర కళ్యాణ మండపంలో మంగళవారం బద్వేల్ నియోజకవర్గం జనసేన పార్టీ ఆత్మీయ సమావేశాన్ని జనసేన పార్టీ సీనియర్ నాయకులు కోటపాటి వెంకటరామ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గం వ్యాప్తంగా భారీగా జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బద్వేల్ నియోజవర్గంలో జనసేన పార్టీ బలాబలాలు, భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించారు. ముఖ్య అతిధిగా జనసేన నాయకుడు రాష్ట్ర సివిల్ సప్లై కార్పోరేషన్ డైరెక్టర్ తుదిమెళ్ల మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల్లో మన శక్తిని పదిరెట్లు పెంచుకోవలసిన అవసరం ఉందని అన్నారు. మన బలాబలాలను అవగాహన చేసుకొని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకు పోవాల్సిన అవసరం ఉందని, అప్పుడే ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ లను గెలిపించుకోగలుగుతాం అన్నారు. బద్వేల్ మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా జనసేన పార్టీ బలంగా ఉందన్నారు. ఐకమత్యాన్ని పెంచుకుంటూ నూతన నాయకత్వానికి కూడా ఆహ్వానం పలికితే మరింత బలమైన శక్తిగా మారతాం అన్నారు. కడప జిల్లాలో రాజంపేట, రైల్వే కోడూరు ప్రాంతాలేకాదు, బద్వేల్ నియోజకవర్గంలో కూడా జనసేన పార్టీ బలంగా ఉందని నిరూపించాల్సిన భాద్యత మనందరిమీద ఉందన్నారు. మన నాయకుడు పవన్ కళ్యాణ్, లక్ష్యాన్ని సిద్ధాంతాన్ని నిర్మించాలంటే అందరం ఐకమత్యంగా ముందుకు పోవాల్సిన అవసరం ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఈశ్వర్ రెడ్డి, కోటపాటి వెంకటేష్, షేక్ ఇమ్రాన్, సిద్దు, లకిడి వంశీ, ఖలీల్ బాషా, చంద్ర, శ్రీకాంత్ రెడ్డి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## తెలుగు భాషా సంస్కృతులను పరిరక్షించుకోవాలి

## జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



**అంకుశం న్యూస్ పుట్టపర్తి,ఆగస్టు,25:** తెలుగు భాషా వికాసానికి, పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. వ్యావహారిక భాషా ఉద్యమ పితామహుడు, గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన తెలుగు భాషా దినోత్సవ వేడుకల ప్రచార పోస్టర్‌ను మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మాతృభాష అయిన తెలుగును కాపాడుకోవడం మరియు దాన్ని భావితరాలకు అందించడం మనందరి బాధ్యత.జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో తెలుగు భాషా విశిష్టతను చాటేలా వివిధ పోటీలు, కార్యక్రమాలు నిర్వహించాలి.గిడుగు రామమూర్తి పంతులు తెలుగు భాషకు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో డిఆర్ఓ కొండయ్య,డిఇఓ క్రిస్టప్ప ,జిల్లా అధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## 32 మందికి రూ. 30,46,059 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.



**అంకుశం న్యూస్ నంద్యాల ఆగస్టు 25** పేద రోగులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొండంత భరోసా ఇస్తున్నారని, తాను ఎంపీ గా సిఫారసు చేసిన వెంటనే బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నిధులు మంజూరు చేసి వారికి తమ ప్రభుత్వం అండగా ఉందన్న మనోధైర్యం సీఎం చంద్రబాబు కల్పిస్తున్నారని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. నంద్యాల బొమ్మలసత్రం లోని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో 32 మంది బాధితులకు రూ. 30,46,059 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ భాధితులు ఈశ్వర రెడ్డి, బేతంచెర్ల రూ. 3,01,977 లు, బొర్రబేని వెంకటేశ్వర్లు యాదవ్, ఎన్. కొత్తపల్లి రూ. 30,786 లు, పి కిరణ్ కుమార్, నీలివిధి రూ. 26,884 లు, బోయ యెల్ల నాయుడు, శివపురం రూ. 36,500 లు, వడ్డే పార్వతి రైతునగరం రూ. 35,028 లు, ఎం.నరేంద్రనాథ్ రెడ్డికి మరణం గోవిందపల్లి, రూ.53,500 లు, రొడ్డ సురేష్ కుమార్, ముజ్జాఫర్‌నగర్ రూ. 2,26,641 లు, షేక్ షఫీవున్, కొత్తపల్లి రూ. 60,781లు, కర్ణాటి విశ్వనాథ్ రెడ్డి, శ్రీశైలం రూ. 1,53,930 లు మా ఆసుపత్రి ఖర్చులకు సహకరించమని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని కోరగా వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సిఫారసు చేసి మాకు అండగా ఉండేందుకు అవసరమైన సీఎం సహాయ నిధి నిధులు మంజూరు చేసి ఆదుకున్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి, సీఎం చంద్రబాబుకు భాధితులు ధన్యవాదములు తెలిపారు.